ప్రజా విశ్వంభర V3 NEWS లక్ష్యం సమాజహితం

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధి: రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



విశ్వంభర ,సూర్యాపేట : సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్ హౌస్) లో రూ. 28.00 లక్షల 24 వేల విలువైన 80 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గంలో మన ద్వారా 563 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు వాటి విలువ 2,43,29,900/ రూపాయలను, ఏల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) 54,10,000/ రూపాయలు మొత్తంగా 2 కోట్ల 97 లక్షల 39 వేల రూపాయలను సహాయ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వందలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, ఆత్మకూర్ (ఎస్) మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు రామచంద్ర రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

విశ్వంభర, సూర్యాపేట : జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం వేదిక కావడం గర్వకారణమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సంబంధించి కెఐవైజి2026 అధికారిక లోగో, మస్కట్, సెల్ఫీ స్టాండ్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియా పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. తమలోని క్రీడా ప్రతిభను గుర్తించి, కష్టపడి సాధన చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి బి. వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈవో శరీష డిఐఈఓ సులోచన రాణి, డిఎస్డిఓ లత పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పుష్కరాల నాటికైనా గోదావరి రోడ్డుకు మోక్షం కల్పించండి: బొల్లం కిషన్ డిమాండ్

విశ్వంభర, మహాదేవపూర్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో బస్టాండ్ నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు ఉన్న గోదావరి రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లం కిషన్ డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా రోడ్డు నిర్మాణం పెండింగ్‌లో ఉందని, కనీసం డ్రైనేజీ సౌకర్యం కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు కాళేశ్వరానికి వచ్చే అవకాశం ఉన్నందున రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదన్నారు. స్థానిక మంత్రి, సంబంధిత అధికారులు స్పందించి పుష్కరాల నాటికి రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని బొల్లం కిషన్ డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భక్తుల సౌకర్యమే లక్ష్యంగా సీసీ రోడ్డు నిర్మాణం

మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది



విశ్వంభర, సూర్యాపేట : భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయానికి వచ్చే మార్గాన్ని సొంత ఖర్చులతో సీసీ రోడ్డుగా నిర్మించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. సోమవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలోని 46వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కూడా తన వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. శ్రీ రామలింగేశ్వర సహిత త్రిశక్తి, ఆంజనేయ, అయ్యప్ప దేవాలయానికి నిత్యం భక్తులు వస్తుంటారని, వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే పనులు చేయడమే తనకు సంతృప్తినిస్తుందని అన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు, భక్తులకు అవసరమైన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు.సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం చేపట్టడంపై స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రెంటాల సతీష్ శర్మ, ఆలయ చైర్మన్ అనంతుల గణేష్ రామలింగయ్య, సూర్యనారాయణ, సందీప్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, ఎడ్ల ప్రభాకర్, వంగవీటి రమేష్, రాచకొండ శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి మున్సిపల్ పరిధిలో చిరుత సంచారంపై సర్వే



విశ్వంభర, పరిగి : మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు నస్కల్ వ్యవసాయ పొలాల్లో చిరుత సంచారం నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో సర్వే చేసి పరిశీలించారు.చిరుత సంచారాన్ని గుర్తించేందుకు 4 ట్రాప్ కెమెరాలు, 1 సోలార్ కెమెరా ఏర్పాటు చేశారు. కెమెరాల ద్వారా చిరుత కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, రైతులు స్థానిక ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ బీట్ ఆఫీసర్ ప్రతిమ, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు చంద్రయ్య, ఏజాజ్, ఆరిఫ్,అఖిల శ్రీనివాస్ గుప్తా, కోఆప్షన్ సభ్యులు అక్బర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మెంబర్ షిప్ కార్డుల అందజేత



విశ్వంభర, హైదరాబాద్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో, సోమవారం, రాంనగర్ చౌరస్తాలోని శ్రీ సాయి బ్యూటీ సెంటర్ ఐదవ అంతస్తులో, మెంబర్షిప్ కార్డు, సర్టిఫికెట్, అందజేసే కార్యక్రమం కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అల్వాల్ వెంకటాపురం లోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ప్రముఖ సంఘ సేవకుడు శ్రీ బచ్చు వెంకటేశం గారికి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా మెంబర్షిప్ ను, కార్డును,సర్టిఫికెట్, నేషనల్ ప్రెసిడెంట్ శ్రీ కటకం శ్రీనివాస్, నేషనల్ జనరల్ సెక్రెటరీ శ్రీ కల్వ వీరేందర్,చీఫ్ అడ్వైజర్ డాక్టర్ నీలా శ్రీధర్ వారికి అందజేశారు. తదనంతరం శ్రీ కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ మానవ హక్కుల వల్ల ప్రతి వ్యక్తి గౌరవంగా, స్వేచ్ఛగా మరియు భద్రత తో జీవించడానికి పునాదిగా నిలుస్తాయని ఆయన అన్నారు ,నేషనల్ జనరల్ సెక్రెటరీ శ్రీ కల్వ వీరేందర్ మాట్లాడుతూ ఈ మానవ హక్కుల సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ, రాష్ట్రం, అంతరాష్ట్రంగా విరాజిల్లుతుందని, ప్రజలు తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తపరచడానికి, తమకు నచ్చిన మతాన్ని అనుసరించడానికి మరియు నచ్చిన వృత్తిని ఎంచుకోవడానికి, ఇవి స్వేచ్ఛను ఇస్తాయని ఆయన అన్నారు. ,నేషనల్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ నీలా శ్రీధర్ మాట్లాడుతూ అన్యాయమైన అరెస్టులు, హింస లేదా వేధింపుల నుండి ప్రజలకు చట్టపరమైన రక్షణ లభిస్తుందని, ఏదైనా తప్పు జరిగితే న్యాయస్థానాలను ఆశ్రయించే హక్కు ఉంటుందని, ఈ సందర్భంగా శ్రీధర్ అన్నారు.ఈ కార్యక్రమంలో తోట వెంకటేష్, గుడాల శ్రీనివాస్, కోటిక విజయ చందర్,శ్రీ నకిరేకల్ రమేష్, శ్రీ మల్లేష్ శం(డాక్టర్ టీవీ ఛానల్)సీఈవో, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది.

క్రీడలతోనే విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

డా. బి.ఎస్.రావు మెమోరియల్ స్పోర్ట్స్ డే - 2026 వేడుకల్లో ఏజీఎం ఎం.వెంకట్ రెడ్డి



విశ్వంభర, గడ్డి అన్నారం : శ్రీ చైతన్య స్కూల్ గడ్డి అన్నారం బ్రాంచ్ డి ఎస్ ఎన్ ఆర్ జోన్ ఆధ్వర్యంలో డా.బి.ఎస్.రావు మెమోరియల్ స్పోర్ట్స్ డే2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ క్రీడా కార్యక్రమాలతో సందడి చేశారు. ముఖ్య అతిథిగా ఏజీఎం ఎం. వెంకట్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో క్రీడలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి,ఆత్మవిశ్వాసం, నాయకత్వ,లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ ఓటమికి ఏమాత్రం భయపడకుండా నిజమైన క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి సాధన చేస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ఎన్.సువర్ణ రేఖ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెతికి తీయడంతో పాటు వారిలో క్రీడా నైపుణ్యాలను, పెంపొందించేందుకు స్పోర్ట్స్ డే ఎంతగానో ప్రోహదపడుతుందని అన్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థుల ప్రతిభ కనబరచాలని ప్రతి ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రీ చైతన్య విద్యార్థుల విద్యాభివృద్ధి తో పాటు శారీరక మానసిక వికాసానికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను విజేతలుగా ప్రత్యేకంగా అభినందించారు. ఆర్ ఐ ఎన్. రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఎన్. సువర్ణ రేఖ ఆధ్వర్యంలో డీన్ బి. రామశర్మ , జోనల్ పి ఈ టి ఎస్.అమిన్ బాబు, పి ఈ టి బి.ప్రవీణ్ కుమార్ పర్యవేక్షణలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

కార్మికులు సమయపాలన పాటించాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్



విశ్వంభర, పరిగి : మార్నింగ్ విజిట్‌లో భాగంగా పరిగి మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులతో పాటు సిబ్బంది అటెండెన్స్ ను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, సిబ్బంది అటెండెన్స్, సమయపాలన, విధుల నిర్వహణపై సంరక్షించడం జరిగిందన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం అందేలా పారిశుద్ధ్య సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరై బాధ్యతగా పనిచేయాలని సూచించారు.పరిశుభ్రమైన పరిగి ఆరోగ్యకరమైన పరిగి అనే లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య, నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. కార్మికులు సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేయాలి

మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



విశ్వంభర, సూర్యాపేట : సోమవారం ఉదయం నుండే బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలను హౌస్ అరెస్టు చేశారు. సబితా ఇంద్రారెడ్డి, శ్రవణ్ కుమార్, కాలేరు వెంకటేష్, భూపాల్ రెడ్డి సహా పలువురు నేతల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం.నేతలను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో రాష్ట్ర డీజీపీ తక్షణమే సమాధానం చెప్పాలి.మేము ధర్నాలు, నిరసనలు చేయడానికి కాకుండా చట్టబద్ధంగా కేఆర్ఎంబీ వినతిపత్రం ఇవ్వడానికే వెళ్తున్నాం. అనుమతులు లేకుండా నాగార్జునసాగర్ వద్ద ఏపీ ప్రభుత్వం దొంగతనంగా అక్రమ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతోంది.ఏపీ అక్రమ నిర్మాణాల వల్ల హైదరాబాద్ సహా రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు తాగు, సాగునీటి ముప్పు.మంచినీళ్ల పేరుతో నీటిని తరలిస్తూ హైదరాబాద్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నం జరుగుతోంది.కేవలం నలుగురు ప్రజాప్రతినిధులం వెళ్లి విజ్ఞాపన పత్రం ఇస్తామన్నా ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ తెలంగాణ ప్రజల గొంతు నొక్కేస్తున్నారు.ఈ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిగా లొంగిపోయింది. కేసీఆర్ ఆదేశాల మేరకు తెలంగాణ ప్రజల పక్షాన నిలబడేందుకు వెళ్తుంటే అడ్డుకోవడం దారుణం. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను వెంటనే విడుదల చేసి, కేఆర్ఎంబీకి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతించాలి.

ప్రజా ఫిర్యాదులపై వేగంగా పోలీస్ సేవలు : ఎస్పీ కె.నరసింహ



విశ్వంభర, సూర్యాపేట : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీసు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారుల తో జిల్లా ఎస్పీ నరసింహ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వినతులను పరిశీలించారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలు, తక్షణ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు.ప్రజా రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు.ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

యెంకపల్లిలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు

విశ్వంభర,హైదరాబాద్ : ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2026 సందర్భంగా ఇన్ టాక్ రంగారెడ్డి చాప్టర్, జెబిఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మొయినాబాద్ మండలం యెంకపల్లి గ్రామంలో వారసత్వ అవగాహన, చారిత్రక సంపదల డాక్యుమెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న కే టి బీస్ అధ్యక్షులు శ్రీరామోజు హరగోపాల్ మాట్లాడుతూ యెంకపల్లిలోని ప్రాచీన జైన శాసనాలు కళ్యాణి చాళుక్యుల కాలం నాటి మత, సాంస్కృతిక చరిత్రకు కీలక ఆధారాలని తెలిపారు. వాటిని గుర్తించి పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్ టాక్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేదకుమార్ మణికొండ మాట్లాడుతూ చారిత్రక చెరువులు, జలవనరులు, వాటి అసలు హద్దులను కాపాడుకోవాలని సూచించారు. జాగరాజు మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణలో యువ ఆర్కిటెక్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.జేబి ఆర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొని చారిత్రక వారసత్వ పరిరక్షణపై అవగాహన పొందారు. ఇన్ టాక్ రంగారెడ్డి చాప్టర్ కన్వీనర్ ప్రొ ఫెసర్ ఆర్కిటెక్ట్ జె. గాయత్రి అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్ టాక్ సభ్యులు రాంరాజ్, ఆదర్శ్, మరియా, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.



ఇనుగుర్తి ప్రజావాణికి డిఎల్పీఓ హాజరు



విశ్వంభర,ఇనుగుర్తి : ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వారం వారం మండల స్థాయిలో ప్రవేశపెట్టిన ప్రజావాణి కొనసాగుతోంది. మండల కేంద్రం ఇనుగుర్తి లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి డి ఎల్పి ఓ గంగా భవాని హాజరయ్యారు. తహసిల్దార్ సుంకర శ్రీనివాసులు ఎంపీడీవో తోట హరీష్ పాల్గొన్నారు.ప్రజావాణికి రెవెన్యూ సంబంధించి కేవలం ఒకే దరఖాస్తు రావడంతో అధికారులు స్వీకరించారు.

ప్రజావాణి చక్కని వేదిక:డిఎల్పిఓ

ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు హాజరవుతున్న దృష్ట్యా సమస్యలు పరిష్కరించడానికి ఇది ఒక చక్కని వేదికని డి ఎల్ పి ఓ గంగాభవాని అన్నారు.మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోగ్య నాయక్ తండాలో మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ



విశ్వంభర, పరిగి : చౌడాపూర్ మండలంలోని గోగ్య నాయక్ తండా గ్రామ పంచాయతీలో మహిళా స్వయం సహాయక సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలను కోటీశ్వరులు గా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు పెట్రోల్ బంకులు, బస్సులు, వివిధ పరిశ్రమలు, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.ఎంపీడీఓ వెంకన్న గౌడ్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి, మహిళల ఐక్యతకు, ఆర్థిక అభివృద్ధికి భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్, గ్రామ సర్పంచ్ భాస్కర్, వాల్యా నాయక్, తండా సర్పంచ్ నరసింహ నాయక్, అడవి వెంకటాపూర్ సర్పంచ్ రవి నాయక్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సలీం, పీఏసీఎస్ డైరెక్టర్ దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ చెల్లదు

కాలనీ వాసుల సమక్షంలో ఎన్నికలు నిర్వహించబడతాయి

టెలిఫోన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి

విశ్వంభర, బోడుప్పల్ : బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని టెలిఫోన్ కాలనీ సంక్షేమ సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించడాన్నీ ప్రస్తుత కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. టెలిఫోన్ కాలనీలో ఎన్నికలు నిబద్ధతగా ఓటింగ్ విధానం ద్వారా ప్రజల అభిప్రాయంతో అధ్యక్షులను ఎన్నుకోబడతామని కానీ, వీరు నిబంధనలకు విరుద్ధంగా ఏకగ్రీవంగా అధ్యక్షులు అయ్యామని ప్రకటించడం చట్ట విరుద్ధమని, ఈ కమిటీ చెల్లదని ఆరోపించారు. టెలిఫోన్ కాలనీ అధ్యక్ష ఎన్నికల ముగియనున్న నేపథ్యంలో కొత్త బాడీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసామని,మేడిపల్లి పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇచ్చామనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సవ్యంగా ఎన్నికలు జరిగే విధంగా చూడాలని పోలీసులను కోరమని తెలిపారు. అయితే కొంతమంది స్వార్థపరులు బైలాస్ ను అతిక్రమించి ఏకగ్రీవంగా ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. త్వరలో నిబంధనలకు అనుగుణంగా కొత్త కమిటీని ఎన్నుకుంటామన్నారు. ప్రజలను తప్పుతోవ పట్టించడానికి కొంతమంది కుట్రలు పన్నుతున్నారని కాలనీవాసులు ఏమాత్రం ఈ కమిటీని విశ్వసించ వద్దని ప్రభాకర్ రెడ్డి కోరారు. త్వరలో కాలనీ వాసుల సమక్షంలో ఎన్నికలు నిర్వహిస్తామనీ, కాలనీ అధ్యక్షుని ఎంచుకునే బాధ్యత కాలనీవాసులపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో టెలిఫోన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

